క్లుప్తంగా

మండలానికి 80 యూనిట్లు మంజూరు



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీడీఓ

బనగానపల్లె రూరల్: బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి బనగానపల్లె మండలానికి 80 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ బీవీ రమణ తెలిపారు. ఇందులో బీసీ(ఏ)- 34 యూనిట్లు, బీసీ(బీ)- 20, బీసీ(డీ)- 10, బీసీ(ఈ)-16 యూనిట్లు చొప్పున మంజూరైనట్లు వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా ఇప్పటి వరకు సుమారు 300 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. ఈ నెల 12 తేదీ చివరి రోజు నాటికి 500 నుంచి 600 పెరిగే అవకాశం ఉంది.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

కోవెలకుంట్ల: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డిపోలో పనిచేస్తున్న 20 మంది డ్రైవర్లు, కండక్టర్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ.. యువతి, యువకులు రక్తదానం చేయడం వల్ల ఎంతో మందికి ప్రాణదానం చేసినట్లేనన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ తిరుపతయ్య, యూనియన్ నాయకులు శివరాం, డీడీగిరి, ఆచారి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



రజతం సాధించిన బాలుడిని అభినందిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: విజయవాడలో స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో డోన్‌కు చెందిన పియూస్‌రెడ్డి కటా విభాగంలో బ్రౌంజ్ మెడల్ సాధించినట్లు కరాటే మాస్టర్ రమణ తెలిపారు. ఈ సందర్భంగా పియూస్‌రెడ్డిని అభినందించారు.

విలువలతో కూడిన విద్యనందించాలి



క్రీడా సామగ్రి అందజేస్తున్న మహమ్మద్ ఇక్బాల్

అవుకు: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని మాజీ ఎమ్మెల్సీ, రిటైర్డ్ ఐజీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. అవుకు జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రమశిక్షణ, క్రీడలు అవసరమని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు శింగయ్య, చెన్నకేశ్వరి, ఎస్‌ఐ రాజారెడ్డి పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన



వెలుగు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వీఓఏలు

బేతంచెర్ల: రాజకీయ నాయకుల ఒత్తిడితో విధుల నుంచి తొలగించిన వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయం ఎదుట వీఓఏలు మంగళవారం నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, మధుశేఖర్ మాట్లాడుతూ.. నాయకుల మాటలకు తలొగ్గి వీఓఏలను అకారణంగా తొలగించిన ఏపీఎం మధుసూదన్ గౌడ్‌ను సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రమేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకుని వీఓఏలకు పెండింగ్ జీతాలతో పాటు గ్రామాల్లో సభ్యుల తీర్మానం ఉన్న వీఓఏలను కొనసాగించడానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

వ్యవ'సాయం' జరిగేనా..?

- ఉపాధి పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్న కూలీలు
- వ్యవసాయ పనులకు కూలీల కొరత
- పంట కోతల సమయంలో కూలీలు లభించక రైతుల ఇక్కట్లు
- ప్రకటనలకే పరిమితమవుతున్న ప్రభుత్వ హామీ



పూడికతీత పనుల్లో ఉపాధి కూలీలు



వరినాట్లు వేస్తున్న కూలీలు

బనగానపల్లె రూరల్: జాతీయ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలని ఎన్నో ఏళ్ల నుంచి రైతుల డిమండ్. ప్రభుత్వాలు కూడా ఎన్నికల సమయంలో ఈ అంశంపై ప్రకటనలు చేస్తున్నాయి తప్ప అమలుకు మాత్రం నోచుకోవడం లేదు. ఎక్కువ మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తుండడంతో వ్యవసాయంలో కూలీల కొరత ఏర్పడుతోంది. నంద్యాల జిల్లాలోని మొత్తం 28 మండలాల్లో ఉపాధి పనులకు సుమారు 2.55 లక్షల మంది కూలీలుగా నమోదు చేసుకోగా 2.10 లక్షల మంది యాక్టివ్‌లో ఉన్నారు. మరికొందరు ఇతర గ్రామాలు, జిల్లాలకు వలస కూలీలుగా వెళ్తున్నారు.

వ్యవసాయానికి కూలీల కొరత

ప్రతి గ్రామంలో ఎక్కువ సంఖ్యలో ఉపాధి హామీ పనులకు వెళ్తుండడంతో వ్యవసాయ పనులు చేసేందుకు కూలీల కొరత ఏర్పడుతోంది. వ్యవసాయంలో అధునిక యంత్ర పరికరాలు ఎన్ని అందుబాటులో ఉన్నా ఎక్కువ శాతం కూలీల ద్వారానే పనులు చేయాల్సి వస్తోంది. ఉపాధి పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేస్తే చిన్న, సన్న కారు రైతులకు ఊరట లభించడంతో పాటు ఆర్థిక భారం తగ్గుతుంది. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని ఉపాధి పథకంతో అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చిన అమలు చేయలేదు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్రంలో బీజేపీ-టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నందున టీడీపీ ప్రభుత్వం ఎందుకు ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేసే దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు పలు రకాల పంటలు వేస్తారు. చాలా మంది రైతులు పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యక్తుల నుంచి వడ్డీ తీసుకుని వ్యవసాయం చేస్తుంటారు. వర్షాభావ పరిస్థితులు, ధరలు పడిపోవడం, తెగుళ్లు, పెట్టుబడులు పెరగడం వంటి కారణాలతో నష్టాలనే ఎదుర్కొంటున్నారు. వరి, మొక్కజొన్న, జొన్న, కంది, శనగ సాగు చేస్తున్న రైతులు విత్తనాలు చల్లడం, కోతలు నూర్పిళ్లు తదితర పనుల కోసం ఎకరానికి రూ.30 వేల నుంచి 40 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే కూలీల కొరతతో పాటు పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గుతాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని రైతులు కోరుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల మండలాల్లో మొత్తం 46,074 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 36,529 మంది కూలీలు ఉన్నారు. వీరిలో ప్రతి రోజు సుమారు 10-15 వేల మంది వరకు ఉపాధి పనులకు వెళ్తుంటారు. ఈ కారణంగా చాలా మండలాల్లో వ్యవసాయానికి కూలీల కొరత నెలకొంటోంది. వ్యసాయ పనుల సమయంలో కూలీలకు అధిక మొత్తం ఇచ్చి పనులకు తీసుకెళ్తుంటారు.

జాబ్‌కార్డుల వివరాలు

మండలం	జాబ్‌కార్డులు	ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య
బనగానపల్లె	12977	10229
కోవెలకుంట్ల	7101	5666
కొలిమిగుండ్ల	9565	7420
అవుకు	9162	7292
సంజామల	7269	5972

రైతులకు ఉపయోగం



జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయడం వల్ల రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పంటల సాగు రైతులకు భారంగా మారింది. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టినా లాభాలు మాత్రం రైతులకు దక్కడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

–జనార్దన్‌రెడ్డి, రైతు, పసుపల గ్రామం

అనుసంధానం చేయాలి



ప్రస్తుతం రైతులు ఏ పంట వేసినా కనీసం పెట్టుబడులు కూడా దక్కడం లేదు. దీంతో నష్టాలపాలవుతున్నారు. కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలి. ఇలా చేస్తే కనీసం పెట్టుబడి ఖర్చులు అయినా తగ్గుతాయి.

–వడ్డె రమణ, రైతు, నందవరం

అప్పులే మిగులుతున్నాయి



రెండేళ్ల నుంచి రైతులకు వ్యవసాయం భారంగా మారింది. ఏ పంట వేసినా పెరిగిన ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చు కారణంగా అప్పులే మిగులుతున్నాయి. కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలి.

–మోహన్‌బాబు, రైతు, పెద్దరాజుపాళెం

పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి



పెట్నికోటలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐజీ మహ్మద్ ఇక్బాల్

కొలిమిగుండ్ల: త్వరలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని రిటైర్డ్ ఐజీ మహ్మద్ ఇక్బాల్ సూచించారు. మంగళవారం కొలిమిగుండ్ల, పెట్నికోట ఉన్నత పాఠశాలలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర ఆలోచనలకు స్వస్తి చెప్పి పరీక్షలపై దృష్టి సారించాలన్నారు. ప్రయోజకులు కావాలనే ఉద్దేశంతో తల్లితండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తుంటారని.. వారి కష్టాన్ని వృథా చేయరాదన్నారు. పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించేందుకు సాధన చేయాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా ఏవైనా సందేహాలు వస్తే వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. సెల్‌ఫోన్‌కు ఎంత దూరంగా ఉంటే అంత బాగా చదువుపై దృష్టి పెడతారని చెప్పారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల వద్ద క్లోరినేషన్ కిట్లు



క్లోరినేషన్ కిట్ అమర్చిన దృశ్యం

కొలిమిగుండ్ల: ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల ద్వారా సరఫరా చేసే నీరు కలుషితం కాకుండా ఉండేందుకు ట్యాంక్‌ల వద్ద క్లోరినేషన్ కిట్లను అమర్చుతున్నారు. ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను తరచూ శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ చల్లడం వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని అని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరీముల్లా అన్నారు. క్లోరినేషన్ కిట్‌లను అమర్చడం వల్ల చాలా సులభంగా ప్రజలకు సురక్షితమైన నీరు అందించేందుకు గ్రామాల్లో ప్రతి ఓవర్‌హెడ్ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. ట్యాంక్‌ల కింద భాగంలో మెయిన్ పైపులైన్‌కు ఈకిట్ అమర్చుతారన్నారు. గేట్ వాల్వ్ వద్ద క్లోరినేషన్ టాబ్లెట్‌లు వేస్తారని చెప్పారు. అవి నీటి సరఫరా అయ్యే సమయంలో కలుషితం కాకుండా చేస్తాయన్నారు. ఇరవై రోజుల వరకు ఈటాబ్లెట్‌లు వాడుకలో ఉంటాయని తెలిపారు. ఇందు కోసమే ఒక్కో ట్యాంక్ వద్ద రూ.10 వేలతో కిట్‌లు ఏర్పాటు చేయిస్తున్నామని పేర్కొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

కొలిమిగుండ్ల: రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వాయు కాలుష్యం వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారాన్ని యాజమాన్యం చెల్లించాలని రైతులు గూడురు నాగేశ్వరరెడ్డి, పెద్దయ్య, పుల్లయ్య, పలువురు రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం కొలిమిగుండ్ల, కల్వటాల, మీర్జాపురం గ్రామాలకు చెందిన రైతులు తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుమ్మూధూళితో పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గిపోతున్నాయని.. ఇటీవలే సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వీటిపై నివేదిక ఇవ్వాలని ఆర్డీఓను ఆదేశించారన్నారు. రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారన్నారు. కాలుష్యం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని అధికారుల బృందం నివేదికలు తయారు చేసిందని చెప్పారు. ఒక్కో రైతుకు ఎంత మేర నష్టం జరిగిందో అంచనా తయారు చేశారన్నారు. యాజమాన్యం నుంచి తమకు నష్టపరిహారం విషయంలో స్పష్టత రాలేదని రైతులు వాపోయారు. మరోసారి కలెక్టర్‌ను కలువనున్నట్లు తెలిపారు. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు వేసిన ప్రతిసారి దుమ్ము వల్ల పంటలకు నష్టం జరుగుతుంటుందన్నారు. రైతులు శ్రీకాంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీలో ఖాళీలు భర్తీ చేయాలని నిరసన



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

డోన్ టౌన్: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో ఖాళీలను భర్తీ చేయాలని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డోన్ బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు రహంతుల్లా, దేవన్న డిమాండ్ చేశారు. ఆ సంఘం పిలుపు మేరకు మంగళవారం స్థానిక కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి బ్రాంచ్ మేనేజర్ రాముడుకు వినతిపత్రం అందజేశారు. ఎల్‌ఐసీలో కొన్నేళ్లుగా ఖాళీగా భర్తీ చేయకపోవడంతో ఉన్న ఉద్యోగులపై పనిభారం పెరిగిపోతోందని తెలిపారు. పాలసీదారులకు సకాలంలో సేవలు అందడం లేదన్నారు. సంఘానికి జాతీయ స్థాయిలో గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఉద్యోగులు కిరణ్, రాఘవయ్య, కళ్యాణ్‌కుమార్, వీరన్న, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్యలు రానీయొద్దు



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్: వేసవి దగ్గర పడడంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న పైప్‌లైన్ పనులను వేగవంతం చేసేందుకు ఫారెస్టు, రెవెన్యూ, హైవే అథారిటీ, మెగా ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని పూర్తి చేయాలని సూచించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తినట్లు ఫిర్యాదు వస్తే సహించేది లేదన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌కొత్తపల్లె, ఆర్‌ఎస్ రంగాపురం, గోరుమానుకొండ గ్రామ సమీపంలో జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఆర్‌ఎస్ రంగాపురంలో జాతీయ రహదారి వెంట సర్వీస్ రోడ్డుతో పాటు గ్రామంలోనే సర్కిల్ రోడ్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు గ్రామస్తులు విన్నవించారు. గ్రామస్తుల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించగా జాతీయ రహదారి అధికారులు అంగీకారం తెలిపారు. అలాగే గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వాటర్ గ్రిడ్ పథకం ద్వారా జరుగుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.

ప్రతి రైతుకు ఆధార్ తరహాలో గుర్తింపు నంబర్



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి,



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నిరంజన్

డోన్: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించే ప్రయత్నంలో భాగంగా ప్రతి రైతుకు ఆధార్ తరహా గుర్తింపు కార్డును ఇస్తుందని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు అశోక్‌వర్ధన్‌రెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ నుంచి రైతులకు గుర్తింపు సంఖ్యను ఇస్తున్నట్లు తెలిపారు. డోన్ వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో 43 వేల మంది రైతులు ఉన్నట్లు చెప్పారు. గుర్తింపు సంఖ్య పొందేందుకు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. విశిష్ట గుర్తింపు కార్డు సంఖ్య పొందిన రైతులకు మాత్రమే పంటల బీమా, పంటనష్ట పరిహారం, యంత్ర పరికరాల కొనుగోలులో సబ్సిడీ, ఉద్యాన పంటల్లో లభించే రాయితీలు, పంట విక్రయాలు, పీఎం కిసాన్ లాంటి ప్రయోజనాలు లభిస్తాయన్నారు. రైతులందరూ విశిష్ట గుర్తింపు కార్డు సంఖ్య పొందేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కోవెలకుంట్ల: వ్యవసాయ రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాల వర్తింపునకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని ఏడీఏ సుధాకర్, ఏఓ నిరంజన్ అన్నారు. మంగళవారం మండలంలోని రేవనూరు, కలుగొట్ల గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. డిజిటల్ అగ్రికల్చర్‌లో భాగంగా రైతు సేవా కేంద్రాల్లో రైతుల వివరాలు నమోదు చేస్తున్నామని తెలిపారు. దీని ఆధారంగానే రానున్న రోజుల్లో వ్యవసాయ సంక్షేమ, అభివృద్ధి పథకాల రూపకల్పన, వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం అందించడం జరుగుతుందన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు వారి పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు, ఆధార్‌కు లింకైన మొబైల్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య

బేతంచెర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ ఇతర పథకాలు వర్తించాలంటే ప్రతి రైతు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని.. తద్వారా గుర్తింపు నంబర్ కేటాయిస్తామని ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆయా రైతు సేవా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు.



గూటుపల్లె గ్రామంలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

డోన్ టౌన్: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుస్మిత తెలిపారు. ఇంగ్లిష్ మాధ్యమం బోధిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న బాలికలు ఈ నెల 7వ తేదీ నుంచి మార్చి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

డోన్: పట్టణానికి మంచినీరు అందించే గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి వచ్చే పైపులైన్ లీకేజీ మరమ్మతుల కారణంగా ఈనెల 12, 13వ తేదీల్లో పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈదుల దేవరబండ, బండగట్టు మధ్యలో సంగాల, ఆగవేలి గ్రామాల వద్ద పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అసౌకర్యాన్ని గుర్తించి ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

15న మరుగుదొడ్ల నిర్వహణకు వేలం

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమా మహేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ లైసెన్స్ పొందేందుకు బహిరంగ వేలం ఈ నెల 15వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రుడు మంగళవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు రూ.50 వేల డిపాజిట్ చెల్లించి ఉదయం 11 గంటలకు యాగంటి క్షేత్రంలో జరిగే వేలం పాటలో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సమాజ సేవ అందరి బాధ్యత



వసతి గృహానికి ఫ్యాన్లు అందజేస్తున్న సమితి సభ్యులు

డోన్ టౌన్: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి జగన్‌మోహన్, అధ్యక్ష కార్యదర్శులు నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల వసతి గృహానికి దాత మార్సెళ్ల రాజశేఖర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, ఫోకస్ లైట్లను అందజేశారు. సభ్యులు రంగయ్య, శ్రీనివాసులు, కుళ్లాయప్ప, హాస్టల్ వార్డెన్ కరుణ, లెక్చరర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా గ్రామోత్సవం



బాబా విగ్రహంతో గ్రామోత్సవం

డోన్ టౌన్: ఈ నెల 13వ తేదీ ప్రాణప్రతిష్ఠ జరగనున్న సాయిబాబా విగ్రహానికి మంగళవారం పట్టణంలో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. రాజస్థాన్ నుంచి తెప్పించిన పాలరాతి సాయిబాబా విగ్రహానికి వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి సోమవారం జలవాసం చేశారు. మంగళవారం ఉదయం విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగింపు సాగింది. ప్రజలు బాబాను దర్శించుకున్నారు.

సాయిబాబాకు వెండి కిరీటం విరాళం

షిర్డీ సాయిబాబకు వెండి కిరీటాన్ని విరాళంగా అందజేశారు. పట్టణానికి చెందిన కేతపల్లి సుదర్శన్ గుప్త కుటుంబ సభ్యులు రూ.1.50 లక్షల విలువ చేసే వెండి కిరీటాన్ని అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి

బేతంచెర్ల: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 3 నెలలకు ఒక్కసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి 19 గ్రామాల సర్పంచ్‌లకు గాను 8 మంది సర్పంచ్‌లు, 15 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను 10 మంది ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. జెడ్పీటీసీ శివలక్ష్మి సహా పలువురు వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు సైతం డుమ్మా కొట్టడంతో సమావేశం మొక్కుబడిగా సాగింది. ముందుగా విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు, పంచాయతీరాజ్, ఉపాధి, వెలుగు, ఐసీడీఎస్ అధికారులు ఆయా శాఖల నివేదికలను వినిపించారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలకు సమాధానం ఇచ్చారు. గోరుమానుకొండ గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లోని రైతులకు భూపట్టాలు ఇచ్చారు కానీ ఆన్‌లైన్ చేయలేదని విన్నవించగా అసైన్‌మెంట్ కమిటీలో ఉంటే తప్పనిసరిగా ఆన్‌లైన్ చేస్తామని సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్ రెడ్డి సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల నిర్మాణ పనులు, గోర్లగుట్ట, హెచ్ కొట్టాల, డ్రైవర్స్ కాలనీలోని పాఠశాలలు 2025-26 విద్యా సంవత్సరానికి జెడ్పీ హైస్కూలుగా అప్‌గ్రేడ్ అయ్యాయని, ఈ ఏడాది 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఆయా గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు కూడా సహకరించాలని ఎంఈఓ సోమశేఖర్ కోరారు. గ్రామాల్లో నీటి ఎద్దడి ఉంటే తక్షణమే స్పందించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. ఆయా గ్రామాల్లో హౌస్ హోల్డ్ సర్వేకు సహకరించాలని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. వైస్ ఎంపీపీ రంగస్వామి, వెటర్నరీ ఏడీ వసంత లక్ష్మి, ఏఈలు మహేష్, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, తిమ్మయ్య, ఎంపీటీసీలు సభ్యులు శేషు, రామచంద్రారెడ్డి, ఇందిర, శాంతి, వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

బనగానపల్లె రూరల్: చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, కార్యవర్గ సభ్యుడు సుంకయ్య, మండల కార్యదర్శి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ నాయకులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా ఇళ్ల స్థలాల పంపిణీపై ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నారాయణరెడ్డికి అందజేశారు. చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా సమితి సభ్యులు శివనాగయ్య, ఆవుల సుదర్శన్, గోకారి, రైతు సంఘం నాయకులు ఇమాం, సీపీఐ మహిళా నేతలు వెంకటలక్ష్మీ, చంద్రకళ, దేవి, శాంతి, గంగాదేవి, నరసమ్మ పాల్గొన్నారు.

మాలల సభను విజయవంతం చేద్దాం

డోన్: మాలల హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 23వ తేదీ హలో మాల.. చలో కర్నూలు అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు మాలమహానాడు నియోజకవర్గ కన్వీనర్ కురిమెట్ల నారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం నాయకులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. మాలమహానాడు మండల, పట్టణ అధ్యక్షులు నాగేంద్ర, ఓబయ్య, మాజీ కౌన్సిలర్ జాన్సన్, సంఘం నాయకులు జాన్‌ప్రభాకర్, న్యాయవాది సురేంద్రబాబు, నాగేశ్వరరావ్ తదితరులు పాల్గొన్నారు.